ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024
5
విజయనగరం

సిఐటియు నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని ఎస్ఎంఎస్ పరిశ్రమలో కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాడిన సిఐటియు నాయకులపై యాజమాన్యం పెట్టిన కేసును జిల్లాకోర్టు శుక్రవారం కొట్టివేసింది. కార్మికుల సమస్యలపై 2014లో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం ఫిర్యాదుతో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు బచ్చల సూర్యనారాయణతో పాటుగా కార్మికులు పి.గొల్లారావు, వి.శ్రీను , కె.పైడిరాజులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కేసు కొట్టివేత పట్ల సిఐటియు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

కోలుకుంటున్న విద్యార్థులు

చికిత్స పొందుతున్న చిన్నారులకు బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఎస్.కోట సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు కోలుకుంటున్నారు. శృంగవరపుకోట మండలంలోని *గిరిశిఖర గ్రామాలకు చెందిన 20 మంది గిరిజన విద్యార్థులు ఆ అస్వస్థతకు గురై విశాఖలో ఇద్దరు, స్థానిక సిహెచ్‌సిలో 18 మంది చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే వీరంతా కోలుకుంటుండడంతో అటు వారి కుటుంబ సభ్యులు, ఇటు అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు చిన్నారుల స్వగ్రామమైన చిట్టెంపాడులో వైద్యాధికారులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.*

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై సిహెచ్‌సి సూపరింటెండెంట్ నీలతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరకవలసలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లవ్ అండ్ లైట్ స్వచ్ఛంద సంస్థలో పునరావాసం ఉంటున్న విద్యార్థులు కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. లవ్ అండ్ లైట్ సంస్థలో నిబంధనలకు విరుద్ధంగాకేంద్రాన్ని నిర్వహిస్తున్నారని సంబంధిత శాఖ అధికారులు పలు మార్లు విన్నవించామని, తాఖీదులు ఇచ్చినా పెడచెవిన పెట్టి చట్ట విరుద్ధంగా కేంద్రాన్ని నిర్వహించి బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని అన్నారు. . కేంద్రం నిర్వంచడానికి అవసరమయ్యే పత్రాలు, కనీస వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కూడా లేవని అన్నారు. తక్షణమే ఈ కేంద్ర నిర్వాహకులు మీద శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాస్థాయి అధికారులకు ఆదేశాలు

విద్యార్థులను పరామర్శిస్తున్న కేసలి అప్పారావు

జారీ చేశారు కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షులు జి.హిమబిందు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి యాళ్ళ నాగరాజు, చైల్డ్ లైన్ సిబ్బంది అరుణ్ కుమార్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న గిరిజన విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, మురళి రాజు, రామ్ సత్యం, వబ్బిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలో వై ద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

గిరిజన గ్రామాల్లో అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలందించాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ అరుణకుమారికి వినతి అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో అనేక గిరిజన గ్రామాల ప్రజలకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామాల్లో ప్రధానంగా రహదారులు నిర్మాణం చేపట్టాలని వైద్య సౌకర్యం అందేలా బొడ్డవర, దుంగాడ గ్రామాలలో మినీ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, దోమ తెరలను పంపిణీ చేయాలని కోరారు. ఈనెల 15లోపు అత్యవసర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెలికాని ముత్యాలు, పోకల భాస్కర్, ఎర్ర ప్రగడ భాస్కర్, బి శంకర్, ఎన్ బుజ్జి, ఎస్ రాము, ఎస్ నర్సింగ్, అప్పారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న సిపిఎం నాయకులు

ఓపెన్ స్కూల్ ద్వారా చదువు కొనసాగించాలి : కలెక్టర్

27లోగా రిజిష్టర్ చేసుకోవాలని సూచన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆసక్తి, అర్హత ఉన్నవారంతా పదో తరగతి లేదా ఇంటర్ పరీక్షలను ఓపెన్ స్కూల్‌ద్వారా రాసి, అర్ధాంతరంగా ఆగిపోయిన తమ చదువును కొనసాగించ వచ్చునని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై తన ఛాంబర్‌లో కలెక్టర్ అంబేద్కర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఎటువంటి విద్యార్హతలు లేనివారు, చదువును మధ్యలో వదిలేసిన వారు నేరుగా పదోతరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఒక చక్కని మార్గమని అన్నారు. పదోతరగతి లేదా ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైనవారు ఇంటర్ పరీక్షలకు హాజరు కావచ్చునని సూచించారు. ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు నిండేవారంతా పరీక్షలకు హాజరు కావచ్చునని తెలిపారు. పదోతరగతి లేదా ఇంటర్ పరీక్షలకు హాజరు కావాలనుకొనేవారు ఈనెల 27వ తేదీలోగా తమ పేర్లను ఆన్‌లైన్లో లేదా ఎంఇఒ కార్యాలయాల్లో రిజిష్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పదోతరగతి పరీక్షలకు హాజరు కావాలనుకొనేవారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, ఇంటర్ పరీక్షలకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పరోతరగతికి హాజరయ్యే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటి, వికలాంగులు, మహిళలు రూ.900 ఫీజు, ఇతరులు రూ.1300 చెల్లించాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, వికలాంగులు, మహిళలు రూ.1100, రూ.1400 చెల్లించాలని తెలిపారు. ఈనెల 27వ తరువాత నుంచి సెప్టెంబరు 4వ తేదీవరకు రూ.200 అపరాద రుసుముతో ఫీజులు చెల్లించవచ్చునని సూచించారు. ఉపాధిహామీ వేతనదారులు, కార్మికులు, గ్రామీణ మహిళా సంఘ సభ్యులు, పట్టణ మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఒక్కో విభాగం నుంచి కనీసం 500కు తగ్గకుండా ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు హాజరయ్యేలా చైతన్య పరచాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఇంటర్ పరీక్షలకు కూడా కనీసం 1500మంది ఈఏడాది హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డిఇఒ ఎన్. ప్రేమ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ, డివిఇఒ ఎస్.భీమాశంకర్, డిసిఎల్ సుబ్రమణ్యం, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతినాయుడు, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాశిరాజు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వర్షాలతో 'ఉపాధి'కి అంతరాయం

నాలుగు నెలల్లో 1.35కోట్ల పని దినాలే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో ఉపాధి హామీ పనులకు అంతరరాయం ఏర్పడింది. అయితే, ఉపాధి పనులకు బదులు దాదాపు అన్నిచోట్లా వ్యవసాయ పనులు దొరుకు తున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2.18కోట్ల పనిదినాలు కల్పించగా, వేతన దారులకు రూ.311.79కోట్లు మంజూ రయ్యింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో గత నాలుగు ఏప్రిల్ నుంచి, జులై వరకు) నెలల్లో 1.35కోట్ల పనిదినాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది ఇదే సమయానికి 1.53కోట్ల పనిదినాలు పూర్తయ్యాయి. గడిచిన రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎక్కువ పని దినాలే (53,84,643) కల్పించారు. గత ఏడాది మే నెలలో 64,20,835 పనిదినాలు కల్పించగా, ఈ ఏడాది మేలో 57,08,458 పనిదినాలు మాత్రమే కల్పించారు. జూన్, జులై నెలల్లో కూడా పనిదినాలు ఘననీయంగా తగ్గాయి. 2022-23తో పోలిస్తే దాదాపు 7లక్షల 15వేల పనిదినాలు పెరిగాయి. ఈ ఏడాది మే నెలలో తీవ్రమైన ఎండలు, జూన్ నుంచి వర్షాలు కురుస్తుండడం, జులైలో దాదాపు 25రోజుల పాటు వర్షాలు కురవడం, ఇందులోనూ పది రోజులపాటు వర్షం ఎడతెరిపి కూడా ఇవ్వకపోవడంతో పనులకు ఆటకం ఏర్పడింది. ప్రస్తుతం వరి నాట్లు కూడా ప్రారంభం కావడంతో ఆగస్టులోనూ పున:ప్రారంభమయ్యే అవకాశం లేదు. ఒక వేళ అధికారులు పనులు ప్రారంభించినా, మన జిల్లాల్లో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులు, సన్నచిన్నకారు రైతులు కావడం వల్ల వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటి వరకు కల్పించిన పని దినాలకు వేతనదారులకు వచ్చిన రూ.311.79 కోట్లపై 2/3వ వంతు (రూ.208.90కోట్లు) మెటీరియల్ కాంపొనెంట్ నిధులు జనరేట్ అయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు రూ.34.83కోట్ల మేర భవన నిర్మాణ పనులకు ఖర్చుచేయగా, మిగిలిన మొత్తం మారిన నిబంధనల ప్రకారం భవనాలతోపాటు రోడ్లు, కాలువలకు కూడా ఖర్చు చేయనున్నారు. ఈ నిధులను సద్వినియోగం చేస్తే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడే అవకాశం ఉంది. పాలకుల చొరవ ఏమేరకు ఉంటుందో వేచి చూడాల్సిందే.

ఉద్యోగాల్లో స్థానికుల సంఖ్యపై సర్వే

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని పరిశ్రమలు, వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో స్థానికుల సంఖ్యపై, వారం రోజుల్లో సర్వే నిర్వహించి, నివేదికను సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకే ఇవ్వాలన్న నిబంధన ఎంతవరకు అమలు జరుగుతుందో నిర్ధారించి, ఈ నివేదికను దేశ అత్యున్నత న్యాయస్థానానికి అందజేయాల్సి ఉన్నందున వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. వివిధ శాఖల అధికారులతో తన ఛాంబర్‌లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న 196 కర్మాగారాల్లో ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్‌ను, వివిధ పరిశ్రమల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యపై సర్వే చేయాలని జిల్లా పరిశ్రమల శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని కర్మాగారాలను, పరిశ్రమలను తనఖీ చేయాలని కార్మిక శాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ, ఇండస్ట్రీస్ జాయింట్ డైరెక్టర్ సిహెచ్ గణపతి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోవిందరావు, డిప్యుటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సురేష్, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్, డిసిఎల్ సుబ్రమణ్యం, పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వర్రావు, ప్రభుత్వ ఐటిఐ కన్వీనర్ టివిగిరి పాల్గొన్నారు.

స్కూలు కాంప్లెక్స్ తేదీ మార్చండి : ఆప్టా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెలలో 16, 17 తేదీల్లో నిర్వహించనున్న స్కూలు కాంప్లెక్సు తేదీలను మార్చాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు గణపతిరావు, ప్రకాశరావు విద్యాశామంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఎస్‌సిఇఆర్‌టి ఈ విద్యా సంవత్సరానికి అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసిందని, దాని ప్రకారం 16,17న స్కూలు కాంప్లెక్సులు నిర్వహించాలని సూచించిందని తెలిపారు. ఆగస్టు 16న వరలక్ష్మీ వ్రతం ఉన్నందున మహిళా ఉపాధ్యాయినులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ఆరోజున ఆప్షన్ హాలిడేగా ప్రకటించారని తెలిపారు. కావున స్కూల్ కాంప్లెక్స్ తేదీని 16న కాకుండా 19కు మార్పు చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పోటీకి రంగం సిద్ధం

వైసిపి అధినేత సమక్షంలో నిర్ణయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విశాఖ పట్నం జిల్లా స్థానిక సంస్థల వైసిపి తరపు ఎమ్మెల్సీ అభ్యర్థిగా మన జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరు ఖరారైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో జిల్లా నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోదించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 13లోపు బొత్స నామినేషన్ వేయనున్నారు. అక్కడి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగావున్న వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఎన్నికలకు ముందు జనసేనలో చేరడం, ఆ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం విధితమే. ఈనేపథ్యంలో ఈ స్థానం భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన వైసిపి ముఖ్య నాయకులతో జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్సపేరును ప్రతిపాదించగా నాయకులంతా ఏకోన్ముకంగా ఆమోదం తెలిపారు. ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో నష్టపోయిన వైసిపి శాసన మండలిలో పట్టుకోల్పోకుండా జాగ్రత పడుతోంది. దీనికితోడు ఖాళీ అయిన విశాఖ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవిని బొత్సకు కట్టబెట్టడం ద్వారా మొత్తం ఉత్తరాంధ్రాలోని పార్టీ ఉనికిని నిలబెట్టుకునే పనిలో నిమగ్నమైంది. ఈకోణంలోనే బొత్సకు ఈ స్థానం కట్టబెడుతున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ స్థానంలో మొత్తం 841 ఓట్లు ఉన్నాయి. ఇందులో దాదాపు 615మంది వైసిపికి చెందినవారే. 215మంది టిడిపి చెందిన ఓటర్లు ఉండగా, మిగిలిన 11 ప్రజాప్రతినిధుల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండడంతో బొత్సకూడా పోటీకి అంగీకరించినట్టుగా తెలుస్తోంది. అయితే, టిడిపి కూడా ఈ ఎన్నికల ద్వారా తన బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించే అవకాశాలు లేకపోలేదు. మరో ఐదేళ్ల అధికారంలో ఉండనున్న నేపథ్యంలో వైసిపి నుంచి జంపింగ్‌లు కూడా ఉండవచ్చనే ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి. వాటి సంఖ్య ఎంత వరకు ఉంటుందనేది వేచిచూడాల్సిందే.

నాలుగు కిలోల బంగారు నగలు సీజ్

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో నాలుగు కిలోల బంగారు నగలను పోలీసులు గురువారం రాత్రి సీజ్ చేశారు. లాడ్జిలను తనిఖీ చేస్తుండగా రైల్వే జంక్షన్‌లో ఉన్న సూర్య రెసిడెన్సీలో డిఎస్‌పి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. నాలుగో రూమ్‌లో ఎటువంటి బిల్లులూ లేకుండా నాలుగు కిలోల బంగారు నగలు బ్యాగులో గుర్తించి నగలను సీజ్ చేసి రాజస్థాన్‌కు చెందిన భవేష్ కుమావత్, గుజరాత్‌కు చెందిన బరియ ఆనందకుమార్‌ను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు పంపించారు. ప్రభుత్వానికి జిఎస్‌టి చెల్లించకుండా వ్యాపారులకు నగలను అమ్ముతున్నట్లు గుర్తించామని డిఎస్‌పి శ్రీనివాసరావు చెప్పారు. జిఎస్‌టి అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు. వీరిద్దరూ గత కొన్నేళ్లుగా గుంటూరులో నివాసం ఏర్పాటు చేసుకుని నగలు వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. ఆయనతో పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్నడిఎస్‌పి

బిఎస్ఎన్ఎల్ సిమ్‌లను అప్‌గ్రేడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

బిఎస్ఎన్ఎల్ దశలవారీగా 4జి టెక్నాలజీని విజయనగరం, మన్యం పార్వతీపురం జిల్లాలో ప్రవేశపెడుతోందని, వినియోగదారులు వెంటనే 2జి, 3జి సిమ్‌కార్డులను 4జి సిమ్‌గా అప్‌గ్రేడ్ చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు ఒక ప్రకటనలో కోరారు. 4జికి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత, 2జి, 3జి సేవలు కూడా అందుతాయని తెలిపారు. వినియోగదారులు తమ సిమ్ రకాన్ని (2జి/3జి/4జి) 54040క సందేశాన్ని పంపించి తెలుసుకోవాలని తెలిపారు.

కౌలు రైతులందరికీ రుణం అందాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పొలంలో పంట వేసిన ప్రతి కౌలు రైతుకూ బ్యాంకు నుంచి పంట రుణం అందాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. ఈ ఏడాది కౌలు రైతులకు రూ.70 కోట్ల రుణాలను అందించాలని తెలిపారు. సిసి ఆర్‌సి కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ ఏడాది రుణం అందించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 వేల సిసిఆర్‌సి కార్డులను కౌలు రైతులకు ఇచ్చామని, మండలాల వారీగా ఆ జాబితాలను బ్యాంకు అధికారులకు పంపించామని తెలిపారు. భూ యజమానులు తీసుకుంటున్నారు కనుక కౌలు దారులకు రుణాలు ఇవ్వలేకపోతున్నామని కొంతమంది బ్యాంకర్లు జెసి దృష్టికి తెచ్చారు. పంట వేసిన వారికే పంట రుణం పొందే అర్హత ఉంటుందని, కౌలు రైతులందరికీ రుణం వచ్చేలా చూడాలని అన్నారు. బ్యాంకు నుంచి రుణం పొందిన వారు రుణం చెల్లించకుండానే అదే సర్వే నెంబర్ పై కొత్త రైతు రుణ కోసం వస్తున్నారని, రికవరీ కావడం లేదని బ్యాంకర్లు చెప్పారు . ఇటువంటి సమస్య పరిష్కారం కోసం కొత్త విధానం త్వరలో రాబోతోందని, ధాన్యం కొనుగోళ్ల సమయంలో వారు రుణం పొందిన ఖాతా కే డబ్బులు జమయ్యేలా చూస్తామని తెలిపారు. బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు కలిసి గ్రామాల్లో రైతుల వద్దకే వెళ్లి. రుణ దరఖాస్తులను తీసుకోవాలని సూచించారు. సిసిఆర్‌సి కార్డులు ఉన్న రైతులంతా అర్హులేనని, వారి పై ఎలాంటి అనుమానాలకూ తావులేదని, వారికి పంట రుణాలు, పశు రుణాలను అందజేసి ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

పొలంబడి ఫలితాలు క్షేత్ర స్థాయి కి చేరాలి

పొలంబడిలో నేర్పుతున్న ఉత్తమ అభ్యాసాలు, సాంకేతిక అంశాలు, వాటి ఫలితాలు క్షేత్ర స్థాయి రైతు వరకు చేరాలని సంయుక్త కలెక్టర్ తెలిపారు. బ్యాంకర్ల సమావేశం అనంతరం పొలంబడిపై సమీక్షించారు. ప్రతి మండలంలో పంటల వారీగా, ఎంత మంది రైతులు ఉన్నారు, వారిలో కౌలు రైతులు ఎంతమంది ఉన్నారనే వివరాలను సమర్పించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు, ఎల్‌డిఎం వివిఆర్ మూర్తి, పలు బ్యాంకుల ప్రతినిధులు, ఎడిఎలు, ఎఒలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టండి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని ఒకటో డివిజన్ అయ్యప్పనగర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని ఆ కాలనీ వాసులు శుక్రవారం టూటౌన్ సిఐకి, నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతినిచ్చారు. అయ్యప్పనగర్‌లోని పార్కులు అడవిని తలపించేలా ఉన్నాయని, పందుల పెంపకం, గంజాయి కేంద్రంగా, మద్యం సేవించే బారులుగా మారాయని తెలిపారు. గత రాత్రి మద్యం సేవించి దొంగతనం చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. వెంటనే పోలీసులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, పార్కులను వినియోగంలోకి తేవాలని కోరారు. వినతినిచ్చిన వారిలో యుఎస్ రవికుమార్, ఎన్.సుధీర్, జె.వెంకటరావు, సుదర్శన్, అచ్చుమాంబ తదితరులు ఉన్నారు.

వినతినిస్తున్న అయ్యప్పనగర్ వాసులు

దోమల నియంత్రణకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో దోమల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి నియంత్రణా చర్యలు ఇప్పటికే ముమ్మరం చేసామని, ఫాగింగ్ యంత్రాలతో అన్ని డివిజన్లలో ఫాగింగ్ చేపడుతున్నామని తెలిపారు. రోజుకొక డివిజన్ చొప్పున ఫాగింగ్ చేస్తామన్నారు. 20 లీటర్ల డీజిల్‌లో 1 లీటర్ టిక్ మలాథీన్‌గాని, పైరాత్రం గాని పిచికారి చేసి ఫాగింగ్ చేపడుతున్నామని తెలిపారు. కుంటలు, గుంతలలో ఎంఎల్ ఆయిల్ బాల్స్ పిచికారి చేస్తున్నామన్నారు. సెప్టిక్ ట్యాంకులకు నెట్‌లను అమర్చామన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు ఇళ్లల్లో టైర్లు, కొబ్బరి చిప్పలు, ఫ్రిడ్జ్ అడుగుభాగం, ఎయిర్ కూలర్ల ప్రాంతాలలో నీరు నిలువ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని చెప్పారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగాలు గుర్తించినట్లయితే తక్షణమే వైద్యుని వద్దకు వెళ్లి త్వరితగతిన వైద్య సహాయం పొందాలని కోరారు.

ఉద్యోగ భద్రతకు 5న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5న సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నా లో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. జగన్మోహన్‌రావు తెలిపారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మిక నాయకులతో కలిసి గోడపత్రిక ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్కీం వర్కర్లు ,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని , ఉద్యోగ భద్రత, పిఆర్సి వర్తింపు, బకాయి జీతాలు, హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్పొరేషన్ కార్యదర్శి బొగ్గు భాస్కరరావు, ఉపాధ్యక్షులు కె.రామచంద్రరావు, శ్రామిక మహిళా కన్వీనర్ జి కుమారి, రమా పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు 38 మంది క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 3, 4 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, కేడెట్ తైక్వాండో పోటీలు అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగబోతున్నాయి. రాష్ట్ర పోటీలకు విజయనగరం జిల్లా నుంచి 38మంది క్రీడాకారులు పాల్గొనబోతున్నారు. జిల్లా నుంచి పాల్గొనే క్రీడాకారులకు కోచ్, మేనేజర్‌గా ఎం.గగన్ సాగర్‌దొర, కె.చైతన్య రిఫరీగా కె.దీపిక వ్యవహరించనున్నారు. క్రీడాకారులకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన. అయ్యలు, సిహెచ్ వేణుగోపాల్ రావు అభినందనలు తెలియచేశారు.

రెండు క్వారీలు సీజ్

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గంలోని వైసిపికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి భాగస్వామ్యంగా ఉన్న క్వారీతో పాటు మరో క్వారీని అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. విశ్వంభరా కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సంస్థ కొంగవానిపాలెం రెవిన్యూ రామచంద్ర పేట సమీపంలో అనుమతులు లేకుండా క్రషింగ్ ప్లాంట్ నడుపుతున్నందున ఆర్‌డిఒ సూర్య కళ, మైనింగ్ అధికారులు తనిఖీ నిర్వహించారు. రైతులకు చెందిన 6.59 ఎకరాల బంజరు, డి-పట్టా భూముల్లో కార్యాలయం బిల్డింగ్, స్టోన్ క్రషర్ ప్లాంటును నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పిఒటి చట్టం ప్రకారం భూములపై రైతులు లేకపోవడంతో పాటు అనుమతులు లేకుండా ఈ భూములపై క్వారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున సీజ్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అక్కడున్న మరో క్వారీపై కూడా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. తహశీల్దార్ ఎం.సురేష్, సర్వేయర్ మధుకేశ్వర రావు, విఆర్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. అదే గ్రామం సమీపంలోని కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలోని నర్సింగరావు క్వారీని కూడా అధికారులు సీజ్ చేశారు. ఈ క్వారీని ఎల్‌అండ్‌టి సంస్థకు ఆయన లీజ్‌కు ఇచ్చారు. లీజుదారు పేరున ఎటువంటి ఎక్స్‌ప్లోజర్ అనుమతులూ లేవు. ఎకరా 11 సెంట్ల భూమిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నందున అధికారులు సీజ్ చేశారు.

క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

షాపుల వేలం పాట వాయిదా

అధిక అద్దెలే కారణం?

పాత బడిన విఫణికల్ప, పాత ఐసిఎంటి షాపులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజీవ్ స్టేడియానికి ఆనుకొని నిర్మించిన 30 షాపులకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో షాపులు వేలం పాటకు నగర వాసులెవరూ ఆసక్తి చూపలేదు. కొత్తగా నిర్మించిన రాజీవ్ స్టేడియంలో 21 షాపులకు, పాత ఐడిఎస్ఎంటి 9 షాపులకు, కొత్త ఐడి ఎస్ఎంటి 8 షాపులకు వేలం పాట నిర్వహించారు. అయితే వేలం పాటకు 15 మందికి మించి హాజరు కాలేదు. గతంలో వేలం పాటకు ఒక షాపు కోసం ఇద్దరు వచ్చేవారు. అంతే కాకుండా స్థిరాస్తిపై తహశల్దార్ నుంచి సాల్వెన్స్ సర్టిఫికేట్ లక్షకు తీసుకొని వేలం పాటలో పాల్గొనాల్సి ఉంది. తాజాగా వేలం పాటకు వచ్చిన వారిలో ఒకరిద్దరు మినహా మిగతా వారెవరూ సాల్వెన్సు సర్టిఫికెట్లు తీసుకురాలేదు. దీంతో షాపులకు సరిపడా సంఖ్య రాకపోవడం వలన వేలం పాట వచ్చే శుక్రవారం నాటికి వాయిదా వేశారు.అధిక అద్దెలు, పాతబడిన భవనాల్లో షాపులు ఉండడం వల్లే వేలం పాట పాడేందుకు పెద్దగా ముందుకు రాలేదని తెలుస్తోంది.

విశ్రాంతి బల్లలు ఏర్పాటు

గ్రామంలో ఏర్పాటు చేసిన బల్ల

డెంకాడ: శ్రీ రొంగలి సత్యవతి సర్వీస్ సొసైటీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయం, వైఎస్ఆర్ విగ్రహం, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, దొడ్డిబావా బస్ స్టాప్ వద్ద ప్రజలు కూర్చునేందుకు వీలుగా శుక్రవారం సిట్టింగ్ సోఫాలని ఉచితంగా ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన తప్పనిసరి

విజయనగరం కోట : కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని చెల్లూరు లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి డాక్టర్ తాలాడ దీప్తి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కుష్టువ్యాధి ఇంటింటి సర్వే ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెల్లూరులోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి మైకో బ్యాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. కుష్టువ్యాధి లేని జిల్లాగా అందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రాము, సిడిపిఒ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

సహారా బాధితులను ఆదుకోవాలి

బొబ్బిలి: సహారా బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనకు సహారా బాధితుల సంఘం జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మీదాసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా ఇండియా యాజమాన్యం డిపాజిట్ దారులకు డిపాజిట్ సొమ్ము చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. డిపాజిట్ దారులకు కేంద్రంలో బిజెపి న్యాయం చేయకుండా యాజమాన్యానికి కొమ్ము కాస్తుందని విమర్శించారు. డిపాజిట్ దారులకు డిపాజిట్ సొమ్ము చెల్లించేలా చూడాలని బేబినాయనను కోరారు. సహారా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తామని బేబినాయన హామీ ఇచ్చారు.

గిరిజనుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బేబినాయనకు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు ఎ. కోట అప్పన్న మాట్లాడుతూ కృపవలస, దీవెనవలస, రామన్నవలస, సీయానువలస, చిన అక్కేనవలస గ్రామాల్లో గిరిజనులు జీవనం సాగిస్తున్నారని, ఆయా గ్రామాల్లో విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులు తొలగింపు

భోగాపురం : మండలంలోని ముంజేరు గ్రామంలో కాలువలో ఉన్న తాగునీటి పైపు లైన్లను తొలగించి రహదారిపై నుంచి వేస్తున్నారు. కాలువల్లో ఉండడంతో ఎప్పుడైనా మరమ్మతులకు గురైతే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని సర్పంచ్ గుడి సూరకాంతం అన్నారు. ప్రస్తుతం గ్రామంలో జల జీవన్ మిషన్ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. రహదారిని పగలగొట్టి లోపల నుంచి పైప్‌లైన్ వేస్తున్నామని తెలిపారు. దీంతోపాటే ఈ కాలువల్లో ఉన్న పైప్ లైన్ కూడా రహదారి లోపల వేస్తున్నామని తెలిపారు. దీని వల్ల ప్రజలు కాలువలో ఎటువంటి మరమ్మతుల ఇబ్బందులు ఉండవని ఆయన అన్నారు.

ట్రస్టు సేవలు వెలకట్టలేనివి : సివిల్ జడ్జి

కొత్తవలస: శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ పేద ప్రజలకు అందిస్తున్న సేవలు వెల కట్టలేనివని సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కె. విజయ కళ్యాణి అన్నారు. శుక్రవారం గురుదేవ్ ట్రస్ట్‌లో వికలాంగులకు అవయవాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సివిల్ జడ్జి విజయ కళ్యాణి మాట్లాడుతూ వికలాంగులు, పేదవారు న్యాయ సహాయం పొందడానికి ముందుకు రావాలని, అటువంటి వారి కోసం న్యాయవ్యవస్థ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ముందుగా శ్రీ గురుదేవ ఆసుపత్రిని, ట్రస్ట్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను జడ్జి తిలకించారు. ఈ ట్రస్ట్ చైర్మన్ జగదీష్ బాబు పేద ప్రజలకు అందిస్తున్న సేవలను ఆమె కొనియాడారు. విరుచౌ ఫౌండేషన్ సహకారంతో సుమారు 150 మందికి పైగా వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణి కార్యక్రమం నిర్వహించారు. అంధులకు పింఛన్ వృద్ధులకు రేషన్ ఇచ్చారు. వ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్. వి. ఫణింద్ర, ట్రస్ట్ బృంద సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

బొబ్బిలి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను విద్యార్థులకు విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.సాయికిరణ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలలో భాగంగా మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

రేగిడి: జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర సమరయోధులు పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు రాజాం రెడ్ క్రాస్, మానవతా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ ఎస్ కృష్ణంరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్ పింగళి వెంకయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు, మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ, యన్ తారకేశ్వరరావు, పిడుగు సూర్యారావు, ఊళ్లకుల నీలకంటేశ్వర యాదవ్, యామన భాస్కరరావు, బార్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి పాఠశాలను ఎంఇఒ పరిశీలన

వేపాడ: మండలంలోని రాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల వర్క్ బుక్స్, తరగతి గదులు, టాయిలెట్స్, పాఠశాల ఆవరణ, గోడ పత్రికలు, చతుర్విధ ప్రక్రియలు పిఎం పోషణ, పాఠశాల రికార్డులు పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో సిఆర్‌పి లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

కొత్తవలస: మండలంలో ప్రతి పాఠశాలలో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఇఒ జి.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 8వ తేదిన జరగబోయే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఎక్కడ ఎలాంటి అసంఘటిత కార్యక్రమాలకు చోటులేకుండా ఎన్నికలను విజవంతంగా నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- బాడంగి

సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్ సత్యనారాయణ

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అన్నారు. శుక్రవారం ఆకులకట్ట, డి వెంకయ్యపేట గ్రామాల్లో ప్రజలకు పలు సూచనలు చేశారు. కాలనీల్లోని ఇళ్లను పరిశీలించి ఇంటి పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ప్రత్యేకించి ఇంటి పరిసరాల్లో, నీటితొట్టిలు, పూలకుండీల తొట్టిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఏదైనా అరోగ్య సమస్యలు ఉన్నట్లయితే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు.

9న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

ఈ నెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ చంద్రకళ తెలిపారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

భారీ వాహనాలను నియంత్రించాలి

- రోడ్డుపై ప్రజలు బైఠాయింపు
- మృతుని కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన హామీ

ప్రజాశక్తి- బొబ్బిలి

జయప్రకాష్ పాఠశాల రోడ్డుపై భారీ వాహనాలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. ఇరుకు రోడ్డులో భారీ వాహనాలకు అనుమతి ఇవ్వడం వల్లనే ఏడో తరగతి విద్యార్థి మణికంఠను కంటైనర్ లారీ ఢీకొని దుర్మరణం చెందాడని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాలకు అనుమతి ఇవ్వవద్దని స్థానికులు కొన్ని రోజుల క్రితం నుంచి డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోయారు. గోతుల రోడ్లపైకి భారీ వాహనాలకు ఎలా అనుమతి ఇస్తారని అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపైకి భారీ వాహనాలను అనుమతించవద్దని, రోడ్డు బాగు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదంలో మరణించిన బాలుడు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అధికారులు నిర్లక్ష్యం వల్లనే మణికంఠ మృతి చెందాడని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజలు

బాలుడు కుటుంబాన్ని ఆదుకుంటాం

జయప్రకాష్ పాఠశాల రోడ్డును బాగు చేసి రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలుడు మణికంఠ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన హామీ ఇచ్చారు. రోడ్డు బాగు చేసి భారీ వాహనాలను అనుమతించవద్దని, రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలుడు మణికంఠ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ప్రజలు చేసిన ఆందోళన వద్దకు బేబినాయన వెళ్లి హామీ ఇచ్చారు. సొంత నిధులతోనైన రోడ్డును బాగు చేసి మరణించిన బాలుడు కుటుంబాన్ని ఆదుకుంటామని బేబినాయన హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.

బాలుడుని ఢీకొన్న కంటైనర్ లారీ సీజ్

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

జయప్రకాష్ పాఠశాల రోడ్డులో బాలుడు మణికంఠను ఢీకొన్న కంటైనర్ లారీని గొల్లపల్లి గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని జయప్రకాష్ పాఠశాల రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏడో తరగతి విద్యార్థి మణికంఠ గురువారం రాత్రి దుర్మరణం చెందడంతో వెంటనే స్థానికులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో గొల్లపల్లి మీదుగా వెళ్తున్న ఆరు కంటైనర్ లారీలను గొల్లపల్లి గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఆరు వాహనాలు ఒకే యజమానికి చెందినవి, వీటిలో ఒక వాహనం మణికంఠను ఢీకొన్నట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. ఆరు కంటైనర్ లారీలు పోలీసులు అదుపులోనే ఉన్నాయి.

నిర్లక్ష్యం వల్లనే కుంటుపడుతున్న అభివృద్ధి: కాంగ్రెస్

పాలకులు నిర్లక్ష్యం వల్లనే బొబ్బిలి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడుతుందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో అన్నారు. మున్సిపాలిటీలో జనాభా పెరుగుతున్న రోడ్లు అభివృద్ధి జరగడం లేదన్నారు. ఇరుకు రోడ్లు, గోతులుమయంగా ఉన్న రోడ్లు వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోతులు రోడ్డు వల్లనే జయప్రకాష్ పాఠశాల రోడ్డులో ప్రమాదం జరిగి విద్యార్థి మణికంఠ ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు విస్తరణ చేయాలని, పాడైపోయిన రోడ్లు బాగు చేయాలని అధికారులను కోరారు.

కర్రోతుకు నామినేటెడ్ పదవి ఇవ్వాల్సిందే

టిడిపి నాయకులు, కార్యకర్తల డిమాండ్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్న నేపథ్యంలో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. చాలామంది ఆశావహులు ఈ పదవుల కోసం పోటీ పడుతున్నారు. అయితే ఉత్తరాంధ్రలోనే ఎమ్మెల్యే టికెట్ ఆశించి తీవ్రంగా నష్టపోయిన నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుకు క్యాబినెట్ హోదా కలిగిన పోస్టు ఇవ్వాలని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యేగా జనసేన నుంచి లోకం మాధవి గెలుపొందిన నేపథ్యంలో టిడిపి నాయకులు కొంతమంది ఇప్పటికే జనసేనలో చేరారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో టిడిపి ఉనికిని కాపాడుకోవాలంటే బంగార్రాజుకు కేబినెట్ హోదా కలిగిన నామినేటెడ్ పదవి ఇచ్చి తీరాల్సిందేనని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి టికెట్ ఆయనకేనని చివరి వరకు ఆదిష్టానం చెబుతూ వచ్చింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని కూడా సూచించింది. కానీ జనసేనతో పొత్తులో భాగంగా ఇక్కడ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. చివరకు ఎమ్మెల్సీ ఇస్తామని ఆయనకు అప్పట్లో ఆధిష్టానం హామీ ఇచ్చింది. కాని ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలో బంగార్రాజుతో పాటు పార్టీ కూడా తీవ్రంగా నష్టపోయిందని పలువురు అంటున్నారు. ఇలాంటి ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనకు కేబినెట్ హోదా కలిగిన పోస్టును ఇస్తే బాగుంటుందని అంటున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో కూడా చంద్రబాబు నాయుడు నాతవలసలో జరిగిన ప్రచారసభలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మాధవిని గెలిపిస్తే బంగార్రాజును తాను చూసుకుంటానని నాయకులు, కార్యకర్తలకు బహిరంగంగానే సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో బంగార్రాజుకు సముచిత స్థానం ఇస్తానని కూడా చంద్రబాబు అన్నారు.

దీంతో బంగార్రాజుతో పాటు నాయకులు కార్యకర్తలు జనసేన గెలుపునకు తీవ్రంగా కష్టపడ్డారు. తీరా గెలిపించాక తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న గుసగుసలు టిడిపిలో వినిపిస్తున్నాయి. టిడిపికి కంచుకోటలాంటి నెల్లిమర్ల నియోజకవర్గంలో రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుకోవడం చాలా అవసరమని పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది. ఎమ్మెల్సీలు ఈ ఏడాదిలో ఖాళీ ఆయ్యే అవకాశం లేనందున సముచితమైన నామినేటెడ్ పదవి ఇస్తే ఇక్కడ పార్టీకి, నాయకులకు, కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని అంటున్నారు. లేదంటే ఇక్కడ అన్ని విధాలుగా పార్టీ నష్టపోయే పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు.

పామాయిల్ తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి -పూసపాటిరేగ

ఆయిల్ పామ్ తోటలను తీరం ప్రాంతంలో వేసుకోవచ్చని ఉద్యానవన శాఖ అధికారి జి. జోస్నా అన్నారు. శుక్రవారం మండలంలోని చౌడువాడ కృష్ణాపురం గ్రామాల్లో రైతులకు ఆయిల్ ఫామ్ కంపెనీ పతాంజలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పామాయిల్ తోటలు సాగుబడి దిగుబడులు ధరల నియంత్రణ గూర్చి అంతర పంటలు రాయితీలు తదితర అంశాలను రైతులకు వివరించారు. పామాయిల్ చెట్టుకు కూడా కొబ్బరి చెట్లు వలే ఉంటాయని సుమారు 12 నుండి 15 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయని తెలిపారు. హైబ్రిడ్ చెట్టు ఐదు మీటర్లు ఎత్తు ఉంటుందని దాని వల్ల పండిన పళ్ళను కోత కోయటం సులభంగా ఉంటుందన్నారు. పక్వానికి వచ్చిన తాజా పండ్లు సుమారు 20 నుండి 30 కేజీలు ఉంటుందని అన్నారు. ఒక ఎకరానికి 57 మొక్కలను నాటుకోవచ్చని వీటి జీవితకాలం 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. పామాయిల్ తోటలకు ప్రభుత్వం నుండి రాయితీలు ఇస్తామన్నారు. ఉపాధి కార్డులు గల రైతులకు ఉపాధి హామీలో కూడా రాయితీలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి కంపెనీ మేనేజర్ రాజమోహన్, జూనియర్ మేనేజర్ సునీల్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎ.పార్ధసారథి, సుధా పతాంజలి కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసరావు, గణేష్ పాల్గొన్నారు.

మంచి అభిరుచులు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు, అభిరుచులు అలవర్చుకోవాలని సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారులు కె. సాయిరాం, కె.అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సతివాడ ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆరోగ్యం, మంచి అలవాట్లు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్య కర సమాజానికి వారధి కావాలన్నారు. ముఖ్యంగా కౌమార దశలో బాలికలు రుతుస్రావం వల్ల రక్తహీనత వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటారని, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

విద్యాభివృద్ధికి ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల, పాఠశాలలోనూ మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణిరాజు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన అదిబాబు, అక్కివరం సర్పంచ్ కంది కిరణ్, డెంకాడ మండల జనసేన కో-ఆర్డినేటర్ పైల శంకర్, తొత్తిడి ప్రకాష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

నెల్లిమర్ల: కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శనివారం స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్ పుస్తకాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బానిసకాకుండ విద్య ద్వారా బంగారు భవిష్యత్ తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్‌పర్సన్ బంగారు సరోజినీ, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, అవనాపు సత్య నారాయణ, జనసేన నాయకులు బంగారు భాను ప్రకాష్, నల్లి చంద్ర శేఖర్, రవ్వా నాని, పాండ్రంకి సత్యవతి, ప్రిన్సిపాల్ మజ్జి సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ధర్నా చేస్తున్న నాయకులు

రిటైర్డు కార్మికులకు కనీస ఫించన్ రూ.9వేలు ఇవ్వాలని ఇపిఎఫ్ పింఛన్‌దార్ల సంఘాల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కేంద్ర ప్రభుత్వ సంస్థ పోస్టాఫీసు వద్ద కనీస ఫించన్ 9వేలు ఇవ్వాలని కోరుతూ ఇపిఎఫ్ ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రూ.65 లక్షల మంది ఇపిఎఫ్ ఉద్యోగుల, కార్మికుల కనీస ఫించన్ వెయ్యి నుండి తొమ్మిది వేలు పెంచాలని గత పది సంవత్సరాలు నుండి ఇపిఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు చేస్తున్నా మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన భగత్ సింగ్ కొరియా కమిటీ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలు ఇపిఎఫ్ పింఛను పెంచాలని సిఫార్సులు చేసినప్పటికి మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కేంద్రంలో ఉన్న ఎన్‌డిఎ పక్షాలు మోడీపై ఒత్తిడి తీసుకువచ్చి పెంచిన కనీస ఫించన్ తొమ్మిది వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాగా కనీస ఫించన్ 9వేలు ఇవ్వాలని కోరుతూ ఈనెల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద 6,7,8, తేదీల్లో జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాలో కాళ్ళ అప్పల సూరి, కనకల పద్మ నాభం, లెంక వెంకటప్పుడు, జగ్గిన్ని సత్యా రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై జనసేన ఆరా

ప్రజాశక్తి - వేపాడ

కాలినడకన మారిక వెళ్తున్న కూటమి నాయకులు

మండలంలోని కరకవలస పంచా యతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామాన్ని విజయనగరం, విశాఖ, ఎస్‌కోట నియోజకవర్గం, వేపాడ మండలానికి ఎన్‌డిఎ కూటమి పార్టీకి సంబంధించిన నాయకులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గురువారం సందర్శించారు. ఎనిమిది కిలోమీటర్లు కాలిన డకన మారిక గ్రామాన్ని సందర్శించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్డు అసంపూర్తిగా ఉండిపోవడం, తాగునీటి సమస్య, పాఠశాల నిర్మాణ సమస్యలు, గిరిజనుల అత్యవసర వైద్య సేవలకు ఏ విధంగా వెళ్తారని గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. నేలబావిలో నీరు తాగుతున్నామని, నిధులు మంజూరైన పాఠశాల నిర్మాణం చేపట్టకపోవడంతో చర్చిలోనే పిల్లలు చదువులు సాగిస్తున్నారని గిరిజనులు చెప్పారు. తాత ముత్తాతల నుంచి తాము సాగు చేస్తున్న భూములను తప్పుడు రికార్డుల ద్వారా కొంత మంది కబ్జా చేస్తున్నారని కూటమి బృందానికి చెప్పారు. ఈ పరిశీలనలో విశాఖ జిల్లా జనసేన పార్టీ కన్వీనర్ బి సత్యనారాయణ, వేపాడ మండల జనసేన పార్టీ నాయకుడు సుంకరి అప్పారావు, ఎస్ కోట, వేపాడ మండల జనసేన పార్టీ నాయకులు, కరకవలస టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వై సూర్యం, మారిక గిరిజన గ్రామం టిడిపి నాయకులు జాలారి వీర్రాజు, పి సోమేశ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బిజెపి కుట్రే

దళిత సంఘాల జెఎసి నిరసన

ప్రజాశక్తి - వంగర

రాజ్యాంగాన్ని మార్చడం కోసం బిజెపి కుట్ర పన్నుతుందని అందులో భాగంగానే ఎస్‌సీ వర్గీకరణకు పచ్చ జెండా ఊపారని దళిత బహుజన సంఘాలు జెఎసి నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఐక్యవేదిక ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి, దళిత సేన రాష్ట్ర కార్యదర్శి ఎం గణపతి రావు మాట్లాడుతూ ఐక్యంగా ఉన్న దళిత జాతిని విడదీయాలని ప్రధానమంత్రి మోడీ కుట్ర చేయడం, దానిలో సుప్రీం కోర్టు కూడా భాగ్యస్వామ్యం కావడం విచారకరమన్నారు. మంద కృష్ణ మాదిగను పావుగా వాడుకొని బిజెపి దళితులను, దళిత బహుజనలను విభజించు పాలించు విధానానికి కుట్ర పన్నుతోందని తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతి జారీ చేసిన కులాలు జాబితాను మార్చటానికి వీలులేదని జస్టిస్ బేలఎం త్రివేది తీర్పునివ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు డర్రు రాంబాబు, కొప్పర బుజ్జి, సిర్లి రాజు, చితిరి గంగులు, మజ్జి ఉదయ్ రామ్, జెన్ని చిన్న, యలగాడ సింహాచలం, బొత్స సరోజినీ, వంటల లక్ష్మి, వడ్డీ పార్వతి, పి. సింహాచలం, ప్రవీణ్, వెంకయ్య సుందర రావు పాల్గొన్నారు.

వంగర: నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు

బొబ్బిలి: ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ఛలో ఢిల్లీను జయప్రదం చేయాలని అంబేద్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సొరు సాంబయ్య, మాలమహనాడు ఉత్తరాంధ్ర అధ్యక్షులు గోపాలరావు, జిల్లా కార్యదర్శి రాము కోరారు. చలో ఢిల్లీ ప్రచార పత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఈనెల 7,8,9 తేదీల్లో సామాజిక చైతన్య దీక్షలు నిర్వహిస్తామన్నారు. చలో ఢిల్లీకు మాల ఉపకులాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

అత్తవారి గ్రామంలో మృతిపై అనుమానాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్న శిర్లాం గ్రామ దళిత కాలనీలో ఉన్న తాగునీటి బావిలోకి దూకి ఆర్.ఆముదాలవలస గ్రామానికి చెందిన కుమిలి రాంబాబు (32) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. రాంబాబు గ్రామదేవత వారాలకు అత్తవారింటికి చిన్న శిర్లాం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. అత్తవారింటిలో ఏమి జరిగిందో కానీ అకస్మాత్తుగా బావి దగ్గరికి వెళ్లి బావిలో దూకారు. రాంబాబు బావిలో దూకడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, రేగిడి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బావిలో ఎక్కువ నీరు ఉండడం, రాంబాబు మృతదేహం పైకి తేలకపోవటంతో ఇంజన్ సహకారంతో నీటిని తోడించారు. మధ్యలోనే ఇంజిన్ మొరాయించడంతో ఈత గాల్లను బావిలోకి దించడంతో మృత దేహం లభ్యమైంది. పంచనామ నిర్వహించి, రాజాం ప్రాంతీయ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అత్తవారి గ్రామంలో మృతిపై అనుమానాలు

కుమిలి రాంబాబు రేగిడి తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న గోదాంలో కళాసిగా పనిచేస్తున్నారు. అత్తవారి ఇంటి వద్ద బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భార్యాభర్తలకు గతంలో తగాదాలు ఉండటంతో ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయని చెబుతున్నారు. రాంబాబు మద్యం సేవించి నిత్యం ఇంటికి వచ్చి భార్యతో గొడవలకు దిగుతాడని సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చాక అసలు విషయం తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య సంతోషి, ఒక ఆడపిల్ల సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు..

నేరాలు ఘోరాలు

పాము కాటుతో యువకుడు మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని చింతాడ గ్రామానికి చెందిన యువకుడు కె.సుధీర్ (27) పాము కాటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలు మేరకు.. సుధీర్ కల్లానికి వెళ్తుండగా పాము కాటు వేసినప్పటికి గమనించలేదు. బహిర్భూమికు చెరువుకు వెళ్లగా కాలుకు రక్తం రావడంతో చెరువులో నీటితో రక్తం కడిగి స్నేహితులతో 30 నిమిషాలు వరకూ మాట్లాడాడు. కాలు లాగినట్లు ఉండడంతో స్నేహితులకు చెప్పగా మోటారు సైకిల్‌పై ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అప్పటికే సుధీర్ మరణించినట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామభద్రపురంలో భారీ చోరీ

25 తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో గురువారం తెల్లవారు జామున భారీ చోరీ జరిగింది. పప్పు ఈశ్వరరావు తన కుటుంబ సభ్యులతో తీర్థ యాత్రలకు వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు ఈ చోరీకి ప్లాన్ వేశారు. తమ ఇంటిలో బీరువా లాకర్‌లో భద్రపరచిన సుమారు 25 తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని విజయనగరం క్లూస్ టీమ్ పరిశీలించింది. సంబధిత ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో వేలిముద్రల నమూనాలు సేకరించారు. బాడంగి ఎస్ఐ జయంతి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో చోరీ తీరుపై వివరాలు సేకరించారు. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ దొంగతనం జరగడం విశేషం. ఇటీవల కాలంలో మండలంలో ఎక్కువగా చోరీలు జరగడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల ముందే మండల కేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంకు కష్టమర్ సర్వీస్ పాయింట్లో చోరీ జరగడం, సోంపురం వెళ్లే దారిలో ఒకింటిలో చోరీ జరగడం, ఆరికతోట, బుసాయవలస వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో హుండీని చోరీచేయడం వంటి సంఘటనలు జరగడంపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఈ చోరీలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
O.S. No. 234/2022

BETWEEN:
కెనరా బ్యాంకు, మెయిన్ బ్రాంచ్, విజయనగరం,
Reptd.by బ్రాంచ్ మేనేజర్ ....ప్లయింటిఫ్
AND:
గంటసాల వరలక్ష్మి W/o లేటు శ్రీనివాసరావు
......డిఫెండెంట్

Notice to the Defendant:
గంటసాల వరలక్ష్మి, W/o లేటు శ్రీనివాసరావు, D.No.22-2-11/1, చిక్కాలవీధి, విజయనగరం టౌన్ & జిల్లా.

Hg. Date:12-08-2024

పైన తెలిపిన కేసులో వాది మీపై దావా దాఖలు చేసి యున్నారు. సదరు కేసులో పై కోర్టువారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పై నెంబర్ కేసు తే 12-08-2024దిన వాయిదా వున్నదని ఈపత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 12-08-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాల**కు మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులుప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

//BY THE ORDER OF THE HONOURABLE COURT//

ఇట్లు
S.మధుసూధనరావు,
ప్లయింటిఫ్ తరుపున న్యాయవాది,
విజయనగరం.
Cell:9440163944, 9052446888.